ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మే 12, 2026 | సంపుటి - 22 | సంచిక 223 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## యువతకు ఉపాధి
## అవకాశాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉంది

• మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు 2



**ఎల్‌బినగర్, నినాదం:** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై, వివిధ సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు అప్పాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రయోజనాల కోసమే 'నా పోరాటం



**బిజెపిని ఓడించి సిఎం అయిన వ్యక్తిని నేను**

**జెమిని సర్కస్‌లా బిజెపి ఎన్నికల విధానం**

## అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి
## రాష్ట్రాన్ని డెవలప్ చేస్తామని మోడీ అన్నారు

- మన ప్రాజెక్టులకు అనుమతులను మాత్రమే కోరాం
- బిజెపి అంటే..బ్రిటిష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం ఆ పార్టీ రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం
- మోడీ పాలనతో దేశానికి నష్టం
- మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

**రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు.**

**హైదరాబాద్,మే11(నినాదం):** సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని...

▸▸తరువాయి2లో..

## కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

2

- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- కులానికో రెసిడెన్షియల్ పాఠశాల ఉంది..
- వీటితోనే పెరుగుతున్న కులవివక్ష
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా
- 'ప్రజాపాలన'ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సీఎం రేవంత్



## లంచం తీసుకుంటూ కార్యదర్శి పట్టివేత

**సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీలో..**

**సహకరించిన సర్పంచ్ భర్త కూడా అరెస్ట్**

**కొమురవెల్లి, ఏప్రిల్ 29 (నినాదం):** లంచం మేసిన మరో ప్రభుత్వ ఉద్యోగిని ఎసిబి పట్టుకుంది. బాధితుడి ప్లాట్‌లో నుంచి వెళ్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ ను తొలగించేందుకు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజాగౌడ్ రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.

2



## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

**సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ**

**మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు**

**హైదరాబాద్, నినాదం:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది.

2

## బండి కొడుకు కేసుపై సిఎం సీరియస్

- విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్
- సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు

**హైదరాబాద్,మే11(నినాదం):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరా



బాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు.

2

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర**



**హైదరాబాద్,మే11(నినాదం):** ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

2

## కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

**కనీస వేతన సవరణపై.. డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్,మే 11(నినాదం):** కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు.

2



## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

**ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం**

**ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు**

**న్యూఢిల్లీ, నినాదం:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు.



**హైదరాబాద్, నినాదం: జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.**

▸▸వివరాలు2లో..

## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

- రామగుండం ఎరువుల కర్మాగారం నుండి 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
- సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి.
- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

# బడి పేరుతో గుడి కూల్చివేత

- లంక బిందెల వేటలో 24 అడుగుల తవ్వకాలు
- గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి కాకతీయుల నాటి చారిత్రక శివాలయం కూల్చివేత.
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 500 కోట్ల భారీ కుంభకోణం
- అశోక్ నగర్‌లో మట్టికోట శివాలయం మట్టి పాలు
- మాజీ మంత్రి హరీశ్ రావు

వివరాలు 5



## సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం

- బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

**కోల్‌కతా, నినాదం:** పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది.

2

## సర్ ప్రక్రియపై సిఇవో సమీక్ష

**పకడ్బందీ మ్యాపింగ్ చేపట్టాలని ఆదేశం**

**హైదరాబాద్, నినాదం:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు , ఎన్నికల నమోదు అధికారులు తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరు వరకు 90 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు.

## ప్రార్థనా స్థలాల్లో లౌడ్ స్పీకర్ల గోల

**డిజిపికి లేఖ రాసిన డిప్యూటీ స్పీకర్**



2

**అమరావతి, నినాదం:** ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్‌స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు.

# యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉంది




కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, పిసిసి మాజీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, అధికారులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా పాలన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోంద న్నారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎల్బీన గర్ నియోజకవర్గంలో ఇలాంటి జాబ్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ఎల్బీనగర్ ప్రాంత యువత ప్రతిభ, సామర్థ్యాలు ఎంతో ఉన్నతమైనవని, సరైన అవకాశాలు లభిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే స్థాయికి ఎదగగలరని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం కూడా క్రమశిక్షణతో సిద్ధం కావాలని యువతకు సూచించారు. ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాకుండా కుటుంబానికి అండగా నిలబడే బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ప్రతి వర్గానికి న్యాయం జరుగుతోందని, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు మరియు పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకు చేరువవుతున్నాయని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరై ఉద్యోగ అవకాశాలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దుల వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, బద్దుల వేణు గోపాల్ యాదవ్, ఎర్రవెల్లి మంజులా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, నాయకులు బబ్బూరి ఆనంద్ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, గణేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సామలేటి సాయిరాం, రణధీర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బండి కొడుకు కేసుపై సిఎం సీరియస్

కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టపరమైన పక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక పక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రావిÖణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగపడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.



# తెలంగాణ ప్రయోజనాల కోసమే నా పోరాటం

కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానవి□ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మ□సీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎసఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎసఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యం పైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు. ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆరఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైక్‌ల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆరఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆరఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. . తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



# కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

హైదరాబాద్, : ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో □ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి.

అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సవి□క్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమ□ల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల □ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. □ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు.

# సర్ ప్రక్రియపై సిఇవో సమీక్ష

మ్యాపింగ్ కార్యక్రమానికి సహకరించేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు , గేటెడ్ కమ్యూనిటీలను కలుపుకోవాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులందరూ సంబంధిత బిఎల్‌వోలసంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని సీఈఓ కోరారు. గేటెడ్ కమ్యూనిటీలు, స్లమ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడి ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మ్యాపింగ్ పక్రియను చేపట్టాలని ఆయన సూచించారు. ఓటర్లకు మ్యాపింగ్‌లో సహాయం అందించేందుకు సూపర్వైజర్ స్థాయి అధికారులు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా, స్వయం సహాయక సంఘాలు, రేషన్ షాప్ డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా ఈ మ్యాపింగ్ పక్రియలో భాగస్వామ్యం చేయాలని కోరారు. మరణించిన, వలస వెళ్లిన, శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, విధి విధానాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే తమ నియోజకవర్గాలలోని ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా చేపట్టాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ పురోగతిని సవి క్షించేలా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. అనధికార వ్యక్తులతో ఎటువంటి సమాచారం పంచుకోవద్దని సీఈఓ హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లను లేదా ఓటర్లను గుర్తించడంలో మాత్రమే బిఎల్‌వోల సహాయం తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్పుగా జరిగిన మ్యాపింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని తక్షణమే సరిచేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో ముద్రిత, ఎలక్ట్రా□నిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్లను కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, సాంకేతిక సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమ□నాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొ

## ప్రార్థనా స్థలాల్లో లౌడ్ స్పీకర్ల గోల

ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్దకాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని రఘురామ వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎనఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికార సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని రఘురామ కోరారు.

## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూయా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత / జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సవి క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు.

## సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం

దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హా మీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎసఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు.బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

### ఎల్ బినగర్ జోన్ మున్సిపల్ కమిషనర్‌ని
# కలిసిన చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్ బినగర్, నినాదం:** ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహే ని మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలల్లో ఉన్న పలు సమస్యలపై వారికి లిఖిత పూర్వకంగా వివరించారు. దానికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రాధాన్యత క్రమంలో ముఖ్యమైన పనులను వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంశీ, సైదయ్య, శ్రీ రామకృష్ణా పురం సొసైటీ అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, రాజశ్రీ రామారావు, సౌభాగ్య పురం కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి, కోశాధికారి కృష్ణ మూర్తి, టెలిఫోన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏలిమినేటి సంజీవరెడ్డి, సుబ్బారావు, మహిపాల్ రెడ్డి, మార్గదర్శి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు, ఇందిరా నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంగోపాల్, కోశాధికారి రాధా కృష్ణ, వాసవి కాలనీ వాసులు గ్రంధి రమేష్, కోలుకులపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి
# చెక్కులు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, మే11 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి పరిస్థితిని విన్నవించారు. కొలను హనుమంత రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం కావలసిన ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. సోమవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో ఆర్థిక సాయం పొందిన వారిలో రోడమేస్త్రీ నగర్ కు చెందిన రఫియా బేగమ్ కు 35వేలు, గాజులరామారంకు చెందిన పెరుమల్ల రవి కి 35వేలు, మొహమ్మద్ రుక్ఉద్దిన్ కు 27,500/-, దుండిగల్ కు చెందిన గైక్వార్డ్ రాజుకు 54వేలు, జగద్గిరిగుట్టకు చెందిన ఫాతీమాకు 60వేలు, సుభాష్ నగర్ కు చెందిన ముంతాజ్ బేగమ్ కు 60వేలు, గాలులరామారం కు చెందిన వాసులు నేమూరి శ్రీనివాస్ గౌడ్ కు 37,500/-, దూలపల్లికి చెందిన హిమ బిందు సురకాంతి కి 42వేలు, కుత్బుల్లాపూర్ వాసులు కమ్మరి బ్రహ్మయ్య కు మంజూరైన 50వేల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూర పత్రాలను కొలను హనుమంతరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో
# సర్ కార్యక్రమంపై అవగాహన



**కుత్బుల్లాపూర్, మే 11 (నినాదం) :** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ రంగారెడ్డి నగర్, గిరి నగర్ డివిజన్లలో ముఖ్య నాయకులతో ఎన్ఆర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో సర్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ ఈ నెల 11 నుండి కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ( సర్) పేరుతో 2002 జనాభా లెక్కల ప్రకారం ఎంతమంది ఓటర్లు ఉన్నారు, వారి వివరాలను సేకరించి నూతన ఓటర్లుగా నమోదు చేయనున్నారు. బూత్ స్థాయి, ఏజెంట్ బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లను తొలగించకుండా అప్రమత్తంగా ఉండే విధంగా బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రింది క్షేత్ర స్థాయి లో పనిచేయాలని అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదు అది మన బాధ్యత అన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల అధికారులు, బి ఎల్ ఓ లు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారు, వారికి సరైన సమాచారాన్ని అందించి కార్యక్రమంలో నిష్పక్షపాతంగా సర్ కార్యక్రమం లో భాగస్వాములు కావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గిరి నగర్, చింతల్, రంగారెడ్డి నగర్, డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటికి లేటుగా వస్తున్నాడని
# తండ్రి మందలింపు : కుమారుడు అదృశ్యం



**జవహర్ నగర్, మే 11 (నినాదం):** రాత్రి ఇంటికి లేటుగా ఎందుకు వస్తున్నావని తండ్రి మందలించడంతో... మనస్థాపం చెందిన ఓ కుమారుడు ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమ య్యాడు. బాలాజీనగర్ ముత్తుస్వామికాలనీలో బిస్వకర్మ అర్జున్ కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కుమారుడైన టీకారం బిశ్వకర్మ(20) ఈ నెల 9న రాత్రి ఇంటికి లేటుగా వచ్చాడు. ఎందుకు ఆలస్యంగా ఇంటికి వస్తున్నావని తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన టీకారం బిశ్వకర్మ ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రయాణికులకు, పాదచారులకు, భక్తులకు, రైతులకు, నేను సేవ చేయడం లేదు

### ఎందుకు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు, జిఎంఆర్ అధికారులు

**వెల్దుర్తి, మాసాయిపేట/ మే 11 (నినాదం):** మాసాయి పేట మండలం శివారులోని బంగారం అమ్మ దేవాలయం వద్ద, త్రాగడానికి, మంచినీరు, ఏర్పాటు చేసినారు. గత కొన్ని సంవత్సరాల నుండి, జిఎంఆర్ కార్మికులు, ఎల్లప్పుడూ నిరంతరం చుట్టుపక్కల గ్రామాలలో, పనిచేసే అక్కడికి వచ్చి భోజనాలు, చేస్తుంటారు అదేవిధంగా బస్సు ప్రయాణికులు, ప్రవేట్ బస్సు ప్రయాణికులు, అక్కడ ఆపుకొని సేద తీర్చుకుంటారు, కానీ నిమ్మకు నీరెత్తినట్లు జిఎంఆర్ అధికారులు, ఇంజనీర్లు, రాత్రి ఉదయం డ్యామేజ్ పనులు కొనసాగిస్తుంటారు. వారికి కొన్ని సంవత్సరాల నుండి గుర్తుకు రావడం లేదా, అని పాద చారులు, పక్కనే ఉన్న పొలాలు రైతులు, బంగారం అమ్మ టెంపుల్ దర్శనం చేసుకోవడానికి వస్తున్న భక్తులు, ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల నుండి చూస్తున్నాం, కానీ మరమ్మతులు చేయడం లేదని, ఇది పదిమందికి ఉపయోగపడే మంచినీరు తొట్టె, జిఎంఆర్ అధికారులకు కనబడడం లేదా, ఆగ్రం వ్యక్తం చేశారు. ఎన్ని సంవత్సరాల నుంచి ఎలాగూ ఉంటది పట్టించుకోరా కేంద్రం నుంచి నిధులు వస్తున్నా కానీ ఇది చేయడం



లేదంటే ఎన్ని నిధులు నిర్లక్ష్యంగా ఖర్చు పెడుతున్నా రని, ఈ మంచినీరు తొట్టి నిదర్శనమని, అన్నారు. అనంతరం జిఎంఆర్ అధికారులు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు, ఎదురవు తున్నాయని, గుర్తు చేసుకోవాలని, ఆగ్రహం వ్యక్తంచేశారు.

**Name Correction**

I, Kodakkat Deepa M/O K.Shriya Ajay Kumar D/O A.M.Ajay Kumar R/O 40-336/1,Flat-no-201, Vaibhav apartment, jawahar nagar, Moulali Pincode - 500040 Requesting for name correction of my daughter as given below KODAKKAT SHREYA D/O Ajaykumar for future propose.

# బోధనా పద్ధతులపై గీతంలో శిక్షణ

భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్తి వికాస కార్యక్రమం

శిక్షణలో ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులు

GITAM
DEEMED TO BE UNIVERSITY



**పటాన్చెరు, మే 11(నినాదం) :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమాన్ని (ఆర్పీడీపీ) జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేట్ (ఐపీఏ) విశాఖ చాప్టర్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసం, సమకాలీన బోధనా పద్ధతులతో అనుసంధానించడం ద్వారా పాఠశాల, యూజీ స్థాయిలో భౌతికశాస్త్ర విద్యను బలోపేతం చేయడానికి దీనిని రూపొందించారు. తరగతి గదులలో శాస్త్రీయ జిజ్ఞాస, చురుకైన అభ్యాసం, భావనా స్పష్టత, ప్రత్యక్ష ప్రయోగాలను ప్రోత్సహించే వినూత్న బోధనా పద్ధతుల కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రముఖ సంస్థల నుంచి విశిష్ట విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఇందులో పాల్గొనే వారికి భౌతికశాస్త్రంలోని అధునాతన భావనలు, ఆధునిక విద్యా సాధనాలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులు, అనుకరణలు, ఐసీటీ ఆధారిత బోధన, విద్యార్థి మూల్యాంకన వ్యూహాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారు. గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు చెందిన అధ్యాపక బృందం బోధనా పద్ధతులు, అభ్యాసన సిద్ధాంతాలపై ప్రత్యేక సెషన్లను కూడా నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని లక్ష్యాన్ని మరింత సుసంపన్నం చేయనుంది. ఈ మూడు రోజుల కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, ప్రయోగాత్మక ప్రదర్శనలు, స్వయంగా తయారు చేసుకునే భౌతిక శాస్త్ర కిట్లు, తరగతి గది బోధనా పద్ధతులు, అభ్యసన మూల్యాంకన పద్ధతులు వంటి అంశాలు ఉంటాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంత రామకృష్ణ; విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా; ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్; బెంగళూరులోని ఐఐఎస్ సీకి చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ వంటి నిపుణులు పాల్గొంటారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి.రవి కుమార్; బాబా అణు శక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు; మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ వనజ, ముంబైలోని టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ, హోమీ భాభా విద్యా సంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి తదితరులు పాల్గొని, సదస్యులకు తగిన మార్గదర్శనం చేయనున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల స్థాయి భౌతిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించారు. భౌతికశాస్త్ర విద్యలో ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలను పంచుకోవడానికి ఒక సహకార వేదికను సృష్టించడం దీని లక్ష్యం.

ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమ్వనకర్తలు షామాబీ (77802 74121) లేదా గోపీకృష్ణ (87120 18815) లను సంప్రదించవచ్చు.

# మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి పేదవారికి సహాయం చేసి అండగా నిలవాలి

### కాంగ్రెస్ వినాయక నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు



**మల్కాజిగిరి, మే 11(నినాదం) :** మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తమకు చేతనైన సహాయం చేసి పేదవారికి అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ వినాయక నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు అన్నారు. మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ వినాయక నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండా నిరంజన్, పిట్ల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో వినాయక నగర్ డివిజన్ లోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన నర్సమ్మ అనే వృద్ధురాలికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, 50 కేజీల సన్నబియ్యం ను వృద్ధురాలికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ వినాయక నగర్ డివిజన్ సీనియర్ నాయకులు, మహిళలు,యూత్, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన.. బండి సంజయ్
# కుమారుడుపై కఠిన చర్యలు తీసుకోవాలి
### నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మే 11 (నినాదం) :** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసును ప్రభావితం చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా ప్రభుత్వం వెంటనే అడ్డుకుని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలని, బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని, అలాగే బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రదీప్ అగర్వాల్, సి. సంజయ్, మురళి, అభిషేక్, లక్ష్మీనారాయణ, మెట్టు నటరాజ్, దయానంద్, వాల్మీకి, ధర్మవీర్ సింగ్, అమీన్, నయీమ్, మజర్, అనిత, మన్మోహన్, అహ్మద్ అలీ, రాజ్ రెడ్డి, పవన్, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆసుపత్రిలో నీటి ఎద్దడి..

ఆసుపత్రికి తగ్గిన నీటి సరఫరా..

రోగుల, సిబ్బంది ఇబ్బందులు..

కనీస అవసరాలకు తప్పని తిప్పలు..

ఇబ్బందులకు కలగకుండా చర్యలు తీసుకున్నాం..

సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ..




**హైదరాబాద్ ప్రతినిధి, మే11 (నినాదం):** ఉస్మానియా ఆసు పత్రిలో నీటి ఎద్దడితో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి కి సరఫరా అయ్యే నీటి సరఫరా తగ్గిపోయింది. రోగులు, సిబ్బంది కనీస అవసరాలకు తప్పని తిప్పలు ఏర్ప డింది. రాష్ట్ర నగరంలో ప్రధానమైన ఉస్మానియా ఆసుపత్రి నీరు సరిపోక సతమతమవుతున్నారు. రోజుకు వందలాది మంది చికిత్సలు పొందే ఆసుపత్రిలో నీటి ఎద్దడి తో ఆసుపత్రిలో పని చేసే ఉద్యో గులు, సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్స్, లాబ్స్ లలో నీటి సరఫరా కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి వార్డులలో బాత్ రూమ్ లో కనీస సౌకర్యాలకు సరిపోక కంపు కొడుతున్నాయని రోగులు వాపోతున్నారు.

**అత్యవసర విభాగాల్లో..**

అత్యవసర విభాగాల్లో నీటి సరఫరా కు అంతరం కలుగుతుంది. ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్న సరిపడా నీరు రాకపోవడం తో గత వారం నుండి ఇబ్బందులకు గురవుతున్నారు.

**నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నాం..**

**ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ..**

ఆసుపత్రికి అందించే నీటి సరఫరా తగ్గింది. దీంతో జలమండలి అధికారులతో మాట్లాడి సరఫరా పెంచేందుకు మాట్లాడాం. అంతేకాకుండా ఆసుపత్రిలో ఇబ్బంది కలగకుండా ఉండేలా ఆసుపత్రిలో రెండు పవర్ బోర్ లు వేశాం. వాటితో నేటి నుండి సరఫరా అందిస్తున్నాం.

# సమతుల ఆహారంతో ఆరోగ్యం..

న్యూట్రిషన్ డాక్టర్ జాహ్నవి ప్రియ..

ఫలక్ నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్సవాలు

**హైదరాబాద్ మే11 (నినాదం) :** సమతుల ఆహారంతోనే మనకు ఆరోగ్యమని న్యూట్రిషన్ డాక్టర్ జాహ్నవి ప్రియ అన్నారు. ఫలక్ నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను విద్యార్థుల అవగాహన, సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అందులో బాగంగా యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్, అధ్యాపకులు మరియు విద్యార్థులు కలిసి ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ కళాశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు సమతుల్య ఆహారంతో జీవన విధానంలో ఆరోగ్యవంతగా ఉంటారని సూచించారు. సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ యాంటీ ర్యాగింగ్, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆరోగ్యకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణం అవసరాన్ని వివరించారు. విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించేందుకు ఈ ర్యాలీ దోహదపడుతుందన్నారు. అదేవిధంగా జూలజీ విభాగం ఆధ్వర్యంలో "న్యూట్రిషన్, హెల్త్ అండ్ ఎన్విరాన




మెంట్" సర్టిఫికెట్ కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్, విభాగాధిపతి పరమేశ్వరి, అధ్యాపకురాలు సాజిదా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ మే 11 (నినాదం) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ రోగాలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమ వారం ఉదయం 7 గంటలకే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకున్నారు. డ్యూటీల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. రోగులకు సమయానికి వైద్యం అందించడంతో పాటు అత్యవసర సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్ల వద్దకు వెళ్లిన కలెక్టర్, వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై స్వయంగా ఆరా తీశారు. మందులు సమయానికి అందుతున్నాయా, డాక్టర్లు క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారా, వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై రోగులను ప్రశ్నించారు. కొంతమంది రోగులు ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని చెప్పగా, మరికొందరు పరిశుభ్రత విషయంలో మరింతగా దృష్టి పెట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సానిటేషన్ నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రోగులు మరియు వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి వైద్యాధికారులు బాధ్యత అని, తాను మళ్లీ వచ్చే సందర్శన వరకు పరిశుభ్ర వాతావరణంలో ఉండాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని, అదేవిధంగా ఆసుపత్రికి అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సరైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ప్రతి ఉద్యోగి బాధ్యత, ప్రభుత్వ ఆసుపత్రిలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సనాతన సంప్రదాయ వైభవం - సోమనాథ జ్యోతిర్లింగ పుణ్య క్షేత్రం

**("సోమనాథ క్షేత్ర పునఃప్రతిష్టకు 75 ఏండ్లు" పూర్తి అయిన శుభ సందర్భంగా)**

భారీ సంపదల నెలవుగా నిలిచిన పరమ పవిత్ర సోమనాథ పుణ్య క్షేత్రంపై ముస్లిమ్ పాలకులు 17 సార్లు దండయాత్రలు చేసి ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. క్రీ శ 1024లో గజనీ మహమ్మద్ దండయాత్రలో ఆలయం భారీగా నష్టపోయింది. స్థానికలు తిరిగి నిర్మాణాలు చేపట్టినా ఢిల్లీ పాలకులు అల్లావుద్దీన్ ఖిల్జీ, మొగల్ ఔరంగాజేబ్ దుష్ట పాలనల్లో ఆలయంపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో "జూనాగఢ్ సంస్థానాన్ని" భారత యూనియన్‌లో విలీనం చేయడం, తర్వాత నాటి భారత తొలి హోంశాఖ మంత్రి ఉక్కు మనిషి "సర్దార్ వల్లభాయ్ పటేల్" ఆలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్ నిర్మాణం 1947లో ప్రారంభమై 1951లో పూర్తి కావడంతో నాటి భారత రాష్ట్రపతి "బాబు రాజేంద్ర ప్రసాద్" చేతుల మీదుగా ప్రారంభం అయ్యింది. నాటి నుంచి నేటి వరకు 75 ఏండ్లు పూర్తి చేసుకొని ప్రాణ ప్రతిష్ట ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుగుతున్న శుభ సందర్భంగా ప్రస్తుతం సోమనాథుడికి అమృత మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ శుభ సందర్భంగా నిర్వహిస్తున్న "సోమనాథ అమృత పర్వం" పుణ్య కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఆలయాన్ని సందర్శించడం జరుగుతోంది.

సోమనాథ జ్యోతిర్లింగ క్షేత్ర చరిత్ర:

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రథమ స్థానం గుజరాత్, సౌరాష్ట్ర అరేబియా సముద్ర తీరాన నిర్మితమైన సోమనాథ క్షేత్రానికే దక్కింది. చంద్రుడి శాప విముక్తి జరిగిన క్షేత్రం కాబట్టి సోమనాథ క్షేత్రంగా పేర్కొనబడింది. సిరి సంపదలకు నెలవైన ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు జ్యోతిర్లింగ ఆకారంలో యుగయుగాల నుంచి భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. మందిర చరిత్రలో లెక్కలేనన్ని సార్లు విదేశీ రాక్షస పాలకుల చేతుల్లో దండయాత్రలను చవిచూసి కూడా ధైర్యంగా, సగర్వంగా నిలబడి భక్తులకు దీవెనలు అందిస్తున్నది. స్కాంద పురాణ వివరణ ప్రకారం దక్ష ప్రజాపతికి చెందిన 27 మంది కుమార్తెలను చంద్రుడికి ఇచ్చి వివాహం చేస్తాడు. ఆ 27 మంది భార్యల్లో రోహిణి అనే ఒక్క దానినే చంద్రుడి అతిగా ఇష్టపడి, మిగిలిన 26 మంది భార్యను నిర్లక్ష్యం చేస్తాడు. ఇలా నిరాదరణకు గురైన 26 మంది భార్యకు తమ తండ్రి దక్షుడితో మొరపెట్టుకుంటారు. మామ దక్షుడు తన అల్లుడు చంద్రుడిని మందలించినా చంద్రుడి ప్రవర్తనలో మార్పు కనిపించదు. దీనితో కోపోద్రిక్తుడైన దక్షుడు తన అల్లుడైన చంద్రుడిని క్షయ రోగగ్రస్తుడు కమ్మని శపిస్తాడు. దీనితో చంద్రుడు క్రమం క్షీణించడంతో ప్రకృతి ఔషధాలు, పుష్పాలు వికసించడం ఆగి పోతుంది. దీనిని గమనించిన సమస్త రోగులు బ్రహ్మని ప్రార్థించగా ఆయన మహామృత్యుంజయ మంత్రానుష్టానంతో శంకరున్ని ఆరాధించమని చంద్రుడితో చెబుతాడు. చంద్రుడు చేసిన తపస్సుతో ప్రసన్నుడైన శంకరుడు ప్రత్యక్షమై చంద్రుడిని రోగ విముక్తుడిని చేస్తాడు. దీనితో కృష్ణ పక్షంలో చంద్రకళ రోజు రోజుకు తగ్గుతూ, శుక్ల పక్షంలో దినదినం పెరుగుతుంది. శాపవిముక్తి పొందిన చంద్రుడు పరమానందతతో పరమేశ్వరుడికి స్వర్ణ దేవాలయం నిర్మించినట్లు పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. నాటి నుంచి చంద్రుడి కోరిక మేరకు సోమనాథ జ్యోతిర్లింగరూపంలో పార్వతీ సమేతంగా వెలసి భక్తులను, ముఖ్యంగా కుష్టు రోగులను కటాక్షిస్తున్నాడు ఆ పరమేశ్వరుడు. అనంతర కాలంలో శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాన్ని 'రావణబ్రహ్మ' వెండితో పునర్ నిర్మించగా, ద్వాపర యుగంలో 'శ్రీ కృష్ణుడు' చంపదు చెక్కలతో నిర్మించినట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత 'రాజా భీమ్‌దేవ్' ఈ ఆలయాన్ని రాతితో పునర్నిర్మించాడని గమనించాలి.

భారతీయ ఆత్మగౌరవానికి ప్రతీక:

సృష్టిలో తొలి జ్యోతిర్లింగం కావడంతో దీనికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. సోమనాథేశ్వరుడు చెప్పే శివతత్వం...పునరుత్థానం. రాజకీయపరంగా ఇదొక దేశ సమగ్రతకు చిహ్నం. ఆధ్యాత్మికంగా ఇది మృత్యువుపై గెలిచిన అమరత్వం. సామాజికంగా పడి లేచిన భారతీయ జీవన విధాన కెరటం. సత్యాన్ని ఎన్నిసార్లు అణచివేసినా, మళ్లీ వెలుగులోకి వచ్చిన తీరు అద్భుతమైన దైవ నిర్ణయం. సోమనాథ్ ఆలయం కేవలం గుడి మాత్రమే కాదని, భౌగోళికంగా దక్షిణ ధ్రువానికి నేరుగా ఉన్న "గేట్ వే" అని భావించాలి. దాడులు, ప్రకృతి విపత్తులను తట్టుకుంటూ నిలబడిన సోమనాథుడి తేజస్సు మానవాళి శాంతియుత జీవనానికి పునాదులు వేయాలని కోరుకుందాం. సముద్ర హోరు, చంద్రుల్ని వెన్నెల, శివుని ధ్యానం – ఈ మూడింటి కలయికగా నిలిచిన సోమనాథ మందిరం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రహస్య ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందడం సముచితమైన దైవ నిర్ణయంగా భావించాలి. సనాతన సంస్కృతి స్వాభిమానానికి చిరస్థాయిగా నిలిచిన ప్రతీక మన సోమనాథ జ్యోతిర్లింగం, భారతీయ ఆత్మగౌరవానికి ప్రతీక. సనాతన సంప్రదాయ వైభవం, భారతీయ సంస్కృతి పునర్జాగరణం.



పర్యావరణ హితమైన మందిరాల్లో 'నెట్–జీరో కార్బన్' కాలుష్య రహిత క్షేత్రంగా సోమనాథ ఆలయం తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. ప్రతి ఏటా దాదాపు కోటి మంది భక్తులు దర్శించే సోమనాథ క్షేత్రానికి స్వర్ణయుగం ప్రారంభం అయినట్లు విశ్వసిస్తున్నారు. అజేయ శక్తికి తొలి చిహ్నం అయిన సోమనాథ మందిరం "మరు–గుర్తు శైలి"లో జరిగింది.

జై సోమనాథ్ : జై పరమేశ్వర్ : జై జ్యోతిర్లింగ్.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

---

# వీర భక్తి, దైవిక శక్తి స్వరూపుడు ఆంజనేయస్వామి

**(12 మే "పెద్ద హనుమజ్జయంతి" శుభ సందర్భంగా)**

హిందువుల హృదయాంతరంగాల్లో వానర దేవుడుగా, సంకట మోచనుడిగా వీర భక్త హనుమ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. చైత్రమాసంలో శుక్లపక్షం పూర్ణిమ తిథి రోజున, అనగా 02 ఏప్రిల్ 2026న "హనుమాన్ జయంతి"ని, అదే విధంగా 12 మే రోజున పెద్ద హనుమజ్జయంతిని భక్తకోటి అత్యంత ఉత్సాహం, ఉల్లాసం, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా ఆధ్యాత్మిక సాంప్రదాయంగా మారింది. రామ నవమి రోజున శ్రీరాముడు జన్మించిన కొద్ది రోజులకు హనుమాన్ జన్మించడం ఓ అద్భుత సందర్భం. శివుడి రుద్ర అవతారంగా మారుతిని పరిగణిస్తారు. మాతా అంజలి, వనరాజు కేసరి దంపతులకు సూర్యోదయ సమయాన జన్మించిన సంకట మోచనుడికి అనేక ప్రియమైన పేర్లు ఉన్నాయి. అంజని పుత్రుడు, మారుతి నందనుడు, భజరంగ్‌బలి, సంకట మోచనుడు, ఆంజనేయుడు, పవన సుతుడు, హనుమంతుడు లాంటి పలు నామాలతో భక్తులు నోరారా పిలుచుకుంటూ పునీతులు కావడం చూస్తున్నాం.

### రెండు పర్యాయాలు హనుమన్ జయంతి వేడుకలు:

హిందు శాస్త్రాల ప్రకారం హనుమంతుడు నేటికీ మన మధ్య ఉంటూ భక్తుల కోర్కెలను తీర్చుతూ, సర్వాంతర్యామిగా సంచరిస్తూనే ఉన్నాడని పేర్కొనబడింది. ఏడాదికి రెండు పర్యాయాలు చిన్న, పెద్ద హనుమాన్ జయంతులను నిర్వహించుకోవడం చూస్తున్నాం. హనుమ జన్మదినాన్ని పురస్కరించుకొని చైత్ర మాస శుక్లపక్షంలో పూర్ణిమ రోజున (02 ఏప్రిల్ 2026) ఒక హనుమాన్ జయంతిని, చైత్ర పూర్ణిమ (12 మే 2026) రోజు పెద్ద హనుమజ్జయంతిని, మార్గశిర అమావాస్య రోజున (డిసెంబర్ మాసంలో) రాక్షస రాజు రావణుడిపై శ్రీరాముడి విజయంగా "హనుమ విజయం" పేరున 2వ హనుమ జయంతిని నిర్వహించుకుంటున్నాం. హనుమాన్ జయంతిని వేరు వేరు రాష్ట్రాలు వేరు వేరు తేదీల్లో జరుపుకోవడం జరుగుతున్నదని తెలుసుకోవాలి.

### హనుమన్ జయంతి వేడుకలు:

హనుమాన్ జయంతి రోజున వేకువ జామున నిద్రలేసి స్నానాలు చేసి, నూతన ఎరుపు రంగు వస్త్రాలు ధరించి హనుమాన్ లేదా సీతారాముల దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకొని పూజలు నిర్వహించడం తరుచుగా కనిపిస్తుంది. హనుమన్ కీర్తిని ప్రస్తుతించడానికి మనసారా కీర్తనలు, ఉపవాస దీక్షలు, రామాయణ పఠనాలు, దాతృత్వ సేవలు, భజనలు, హనుమ విగ్రహ ర్యాలీలు, సుందరకాండ పఠనాలు, లడ్డు/బోధది/అప్పాల ప్రసాద వితరణలు, వ్రతాలు చేయడం, హనుమ విగ్రహాలకు చందన అలంకరణలు, పేదలకు/భక్తులకు అన్న ప్రసాద వితరణలు, ధ్యానాలు, ధూపదీప నైవేద్యాల సమర్పణలు, అభిషేకాలు, ఆరతి ఇవ్వడం, పూలు/పండ్ల/తాంబూల సమర్పణలు, మంత్రోచ్ఛరణలు, దానధర్మాలు లాంటి పూజలను భక్తకోటి భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు.

### 41-రోజుల హనుమన్ దీక్షలు :

తెలుగు రాష్ట్రాల్లో 41 – రోజుల పాటు చైత్ర పూర్ణిమ (02 ఏప్రిల్ 2026) నుంచి వైశాఖ శుక్లపక్ష 10వ రోజు వరకు లేదా చైత్ర పూర్ణిమ నుంచి 41వ రోజు హనుమాన్ పెద్ద జయంతి (12 మే 2026) వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో బ్రహ్మచర్యం పాటిస్తూ, కఠోర నియమనిబంధనలు, దురలవాట్లకు నిషేధం విధించుకొని భక్తిభావంతో నిర్వహిస్తారు. హనుమాన్ చాలీసా పారాయణంతో దుష్టశక్తులు తొలగి శాంతి, శ్రేయస్సులు లభిస్తాయనా ప్రగాఢంగా విశ్వసిస్తారు. సీతారాముల అత్యంత ప్రియమైన భక్తుడిగా హనుమకు పేరు ఉంది.

---

# సైబీరియన్ బాతులు...
# ప్రకృతి సందేశం తీసుకొచ్చే వలస పక్షులు



ప్రతి ఏడాది ఎండాకాలం, చలికాలం మార్పులతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంటాయి. వాటిలో ముఖ్యంగా "సైబీరియన్ డక్స్" లేదా సైబీరియన్ వలస బాతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మంచుతో కప్పబడిన రష్యాలోని సైబీరియా ప్రాంతం నుంచి ఆహారం, అనుకూల వాతావరణం కోసం ఇవి భారతదేశంలోని పలు రాష్ట్రాలకు వలస వస్తుంటాయి. ప్రకృతి ప్రేమికులకు, పక్షి వీక్షకులకు ఇవి కనువిందు చేస్తాయి. వేల కిలోమీటర్ల అద్భుత ప్రయాణం

సైబీరియా ప్రాంతంలో చలికాలం తీవ్రంగా పెరిగినప్పుడు సరస్సులు గడ్డకట్టిపోతాయి. ఆ సమయంలో ఆహారం దొరకకపోవడంతో వేలాది పక్షులు దక్షిణ దిశగా ప్రయాణం మొదలుపెడతాయి. హిమాలయాలను దాటి భారతదేశంలోని చెరువులు, సరస్సులు, అడవి ప్రాంతాల్లో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకుంటాయి. కొన్ని జాతులు 4 వేల నుంచి 8 వేల కిలోమీటర్ల వరకు ప్రయాణించడం ఆశ్చర్యకరం.

భారతదేశంలో కనిపించే ప్రాంతాలు

సైబీరియన్ వలస పక్షులు దేశంలోని పలు రాష్ట్రాల్లో దర్శనమిస్తాయి.

ముఖ్యంగా
తెలంగాణ లోని మంచిర్యాల, నిజామాబాద్, సంగారెడ్డి ప్రాంతాల చెరువులు
ఆంధ్రప్రదేశ్ లోని కొల్లేరు సరస్సు
కియోలాదేవో నేషనల్ పార్క్
చిల్కా సరస్సు
పంజాబ్, హర్యానా ప్రాంతాల నీటి వనరులు

ఇక్కడి నీటి వాతావరణం, చేపలు, చిన్న జీవులు, తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఈ పక్షులు కొంతకాలం గడుపుతాయి. ప్రధానంగా కనిపించే వలస పక్షులు

భారతదేశానికి వచ్చే వలస పక్షుల్లో సైబీరియన్ డక్
బార్ హెడ్డెడ్ గూస్
నార్తర్న్ పింటెయిల్
కామన్ టీల్స్
ఫ్లామింగోలు

వంటి జాతులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి చెరువుల్లో గుంపులుగా విహరిస్తూ ప్రకృతికి అందాన్ని తీసుకొస్తాయి.

వలస పక్షులు ప్రకృతికి ఎంతో దోహదం చేస్తాయి. పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి
చెరువుల్లోని చిన్న జీవుల నియంత్రణకు సహాయపడతాయి.
విత్తనాల వ్యాప్తికి దోహదం చేస్తాయి. పర్యావరణ మార్పులను సూచించే సహజ సూచికలుగా పనిచేస్తాయి.

ఒక ప్రాంతానికి వలస పక్షులు రావడం అంటే అక్కడి పర్యావరణం ఇంకా జీవ వైవిధ్యానికి అనుకూలంగా ఉందని భావిస్తారు.

పెరుగుతున్న ముప్పులు

ఇటీవల కాలంలో వలస పక్షుల సంఖ్య తగ్గుతున్నట్లు పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణాలు,
చెరువుల ఆక్రమణ
నీటి కాలుష్యం, వేట
ప్లాస్టిక్ వ్యర్థాలు
వాతావరణ మార్పులు
చెరువులు ఎండిపోవడం, పరిశ్రమల కాలుష్యం పెరగడం వల్ల పక్షులకు సరైన ఆహారం దొరకడం కష్టమవుతోంది.

సంరక్షణ అవసరం

వలస పక్షుల సంరక్షణకు ప్రభుత్వం, అటవీ శాఖతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలి.
చెరువులను పరిరక్షించడం
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం
పక్షుల వేటను అరికట్టడం
పక్షి సంరక్షణపై అవగాహన కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి.

సైబీరియన్ వలస పక్షులు కేవలం పక్షులు మాత్రమే కాదు... ప్రకృతి మనకు పంపే సందేశవాహకాలు. వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి మన చెరువులకు చేరే ఈ అతిథి పక్షులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ప్రకృతి సమతౌల్యం నిలవాలంటే జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిందే.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**7013928155**

---

# రాజకీయ పార్టీల్లో సర్ భయాలు!

సంపాదకీయం

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట□ల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట□ల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట□ల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆరఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమ□లలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట□ల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట□ల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరువి□ద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటివి□ద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు. ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్టం చేయగలుగుతాం. రాష్ట□లు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్యార్ తరహాలో నంబర్ కేటాయించాలి. ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయ.

---


# గురుత్వాన్ని తిరస్కరించిన విశ్వగురువు: జిడ్డు కృష్ణమూర్తి

**అంతర్ముఖ విప్లవం - ఆత్మ విముక్తి: జిడ్డు కృష్ణమూర్తి జీవన దర్శనం**

**ప్రపంచ తాత్విక ముఖచిత్రంపై ఒక అరుదైన నక్షత్రంలా మెరిసిన మహా మేధావి జిడ్డు కృష్ణమూర్తి. 1895 మే 11న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించిన ఈయన, భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక వైజ్ఞానిక దృక్పథంతో ముడివేసి ప్రపంచానికి అందించిన అపురూప దార్శనికుడు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక తాత్విక ఉద్యమం. ఏ మతానికీ, ఏ సిద్ధాంతానికీ కట్టుబడని స్వేచ్ఛాలోచనకు ఆయన చిరునామా. 1909లో అడయార్ సముద్ర తీరంలో ఆడుకుంటున్న బాలుడిని చూసి, ఇతడే "ప్రపంచ గురువు" అవుతాడని థియోసాఫికల్ సొసైటీ నేత సి.డబ్ల్యూ. లీడ్‌బీటర్ అంచనా వేయడం ఒక చారిత్రక మలుపు.**

అప్పటి నుండి అనీ బిసెంట్ పర్యవేక్షణలో పెరిగిన కృష్ణమూర్తిని విశ్వగురువుగా ప్రతిష్ఠించడానికి "ఆర్డర్ ఆఫ్ ది స్టార్" అనే అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించింది. ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 45 దేశాలలో వేలాది మంది అనుచరులు, భారీ ఆస్తులు ఆ సంస్థకు ఉండటం గమనార్హం. అయితే, 1929 ఆగస్టు 3న నెదర్లాండ్స్‌లోని ఓమ్మెన్ నగరంలో జరిగిన సభలో ఆయన చేసిన ప్రకటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తన చుట్టూ ఉన్న వ్యవస్థను రద్దు చేస్తూ, "సత్యం అనేది మార్గరహిత భూమి; దాన్ని ఏ సంస్థ ద్వారా, ఏ గురువు ద్వారా చేరుకోలేము" అని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక రంగంలో అధికారాన్ని, గురుత్వాన్ని తిరస్కరించిన ఈ సాహసం అపూర్వమైనది.

జిడ్డు కృష్ణమూర్తి బోధనల ప్రధాన సూత్రం మానసిక విప్లవం. మానవుడు తన అంతర్గత స్థితిని తానే గమనించుకోవాలని, అక్కడ ఏ బాహ్య మార్గదర్శకత్వానికి తావులేదని ఆయన నమ్మారు. మనిషి తనను తాను తెలుసుకోవడమే అత్యున్నత విద్య అని ఆయన బోధించారు. భయం, అసూయ, కోపం, దుఃఖం వంటి భావోద్వేగాల మూలాలను విశ్లేషిస్తూ, ఆలోచనకు మరియు ఆలోచనాపరుడికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఆయన ఎత్తి చూపారు. మనిషి మనస్సు గతంలో అనుభవించిన స్మృతుల ముద్రలతో నిండిపోయిందని, ఆ ముద్రలే వర్తమానాన్ని కలుషితం చేస్తున్నాయని ఆయన విశ్లేషించారు. "నిన్నటి నుండి విముక్తి" పొందడమే నిజమైన స్వేచ్ఛ అని ఆయన భావన. ఆయన దృష్టిలో జాతీయత, మత విద్వేషం అనేవి కేవలం మనస్సు ఏర్పరుచుకున్న విభజన రేఖలు మాత్రమే. ఇవి అంతిమంగా యుద్ధాలకు, హింసకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రపంచ యుద్ధాల తదనంతరం మానవాళి అనుభవిస్తున్న అశాంతికి పరిష్కారం బాహ్య మార్పుల్లో లేదని, అది మనిషి అంతరంగంలో రావాల్సిన విప్లవాత్మక మార్పు అని ఆయన నినదించారు.



విద్యా రంగంలో కృష్ణమూర్తి తెచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శప్రాయం. విద్య కేవలం జీవనోపాధి కోసం, కేవలం సమాచార సేకరణ కోసం కాదని, అది సంపూర్ణ మానవుడిని తీర్చిదిద్దే ప్రక్రియ కావాలని ఆయన ఆకాంక్షించారు. పోటీ తత్వం, పరీక్షల ఒత్తిడి లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థి వికాసం జరగాలన్నది ఆయన ఆశయం. ఈ లక్ష్యంతోనే రిషి వ్యాలీ (ఆంధ్రప్రదేశ్), రాజఘాట్ (వారణాసి), ది స్కూల్ (చెన్నై), బ్రాక్‌వుడ్ పార్క్ (బ్రిటన్) వంటి ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను ఆయన నెలకొల్పారు. ఇక్కడ విద్యార్థులు కేవలం పుస్తకాలను చదవడమే కాకుండా, ప్రకృతితో మమేకమవ్వడం, మౌనాన్ని అనుభవించడం, తమ మనస్సుల తీరును పరిశీలించడం వంటి విషయాలను అభ్యసిస్తారు. ప్రస్తుతం ఈ పాఠశాలలు ఆధునిక విద్యకు, మానవీయ విలువలకు అద్దం పడుతున్నాయి. భౌతిక శాస్త్రవేత్త డేవిడ్ బోమ్ వంటి వారితో ఆయన జరిపిన సంభాషణలు, విజ్ఞాన శాస్త్రానికి మరియు తత్వశాస్త్రానికి మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చాయి. ఆలోచన యొక్క భౌతిక స్వభావాన్ని, కాలం యొక్క పరిమితులను ఆయన వైజ్ఞానిక కోణంలో చర్చించడం ఆనాటి మేధోలోకాన్ని ఆశ్చర్య పరిచింది.

కృష్ణమూర్తి గ్రంథాలయాల్లోని వందలాది ప్రసంగాలు, పుస్తకాలు మానవాళికి దిక్సూచిగా నిలిచాయి. "ది ఫస్ట్ అండ్ లాస్ట్ ఫ్రీడమ్" పుస్తకంలో ఆయన స్వేచ్ఛ యొక్క పరమార్థాన్ని వివరించగా, "ఫ్రీడమ్ ఫ్రమ్ ది నోన్"లో తెలిసిన విషయాల నుండి మనసు ఎలా విముక్తి పొందాలో చర్చించారు. ఆయన భాష ఎంతో సరళంగా ఉన్నప్పటికీ, దాని వెనుక ఉన్న విశ్లేషణ అత్యంత లోతైనది. సంప్రదాయ మతాలలోని ఆచారాలను, మూఢ నమ్మకాలను ఆయన నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. సత్యాన్ని కనుగొనడానికి ఏ మంత్రం, ఏ తంత్రం అవసరం లేదని, కేవలం సజీవమైన అవగాహన ఉంటే సరిపోతుందని చెప్పారు. 1986 ఫిబ్రవరి 17న ఆయన పరమపదించే వరకు, అంటే సుమారు 90 ఏళ్ల వయస్సులో కూడా తన గొంతును ప్రపంచ శాంతి కోసం, మానవ విముక్తి కోసం వినిపిస్తూనే ఉన్నారు. ఇందిరా గాంధీ వంటి రాజకీయ వేత్తలు, ఆల్డస్ హక్స్లీ వంటి రచయితలు ఆయన ప్రభావానికి లోనయ్యారు.

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావంతో మనిషి ఒంటరితనం, మానసిక ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో కృష్ణమూర్తి బోధనలు మరింత అవసరంగా కనిపిస్తున్నాయి. సాంకేతికత పెరిగినా మానవ ప్రవృత్తిలో క్రూరత్వం, స్వార్థం తగ్గలేదు. మనిషి తనను తాను సంపూర్ణంగా అర్థం చేసుకోనంత కాలం శాంతి అనేది ఒక కల మాత్రమేనన్న ఆయన హెచ్చరిక నేటికీ అక్షర సత్యం. ఆయన ఏ ఒక్క దేశానికో, ఏ ఒక్క మతానికో చెందిన వాడు కాదు; ఆయన ఒక విశ్వ మానవుడు. మానవ చైతన్యంలో మార్పు రావాలని, అది ఎవరికి వారు స్వయంగా సాధించుకోవాలని బోధించిన ఆయన "నిశ్శబ్ద విప్లవ కారుడు". ఆత్మ విమర్శన, నిరంతర అన్వేషణ ద్వారానే మనిషి స్వేచ్ఛగా జీవించగలడని నిరూపించిన జిడ్డు కృష్ణమూర్తి తత్వం, కాలపరీక్షకు నిలిచి భవిష్యత్ తరాలకు ఎల్లప్పుడూ వెలుగునిస్తూనే ఉంటుంది. ఒక భారతీయుడిగా జన్మించి, విశ్వవ్యాప్తమైన ఆలోచనా ధోరణితో ప్రపంచ మేధో సంపదను సుసంపన్నం చేసిన ఆయన చరిత్రలో అజరామరంగా నిలిచి పోతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# విటాయిపల్లి ప్రీమియర్ లీగ్ షురూ!



**ఆమనగల్లు, మే 11(నినాదం):** అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విటాయిపల్లిలో ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఘనంగా ప్రారంభమైంది. 10వ వార్డు కౌన్సిలర్ కోగూరు అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌ను స్థానిక సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సుమారు 8 జట్లు తలపడుతున్న ఈ పోటీలు వారం రోజుల పాటు సాగనున్నాయి. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఈ సందర్భంగా కోరారు.. ఒకటవ వార్డు కౌన్సిలర్ దోలి మల్యా నాయక్, నితిన్ రెడ్డి, శ్రీధర్ నాయక్, పర్వతాలు, రవి, నర్సింహా, దావీదు, శేఖర్, జంగ య్య, వెంకటేశ్వర్లు రెడ్డి, మధు సుధన్ రెడ్డి, జగదీశ్, శంకర్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ పవర్ ప్లాంట్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్, నినాదం 11(నినాదం) :** జిల్లా పరిధిలోని పరిగి నియోజకవర్గం కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామంలోపీ ఎం కుసుమ్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ను పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సహాయం చేస్తున్న సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ను గ్రామానికి చెందిన కొకటం వెంకట రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రూ.7.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి సోలార్ పవర్ ప్లాంట్‌ను నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు.పీ ఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు సౌరశక్తిని వినియోగించుకొని వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం కూడా పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా కుల్కచర్ల మండలం ముజాహిద్ పూర్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సైన్స్ ల్యాబ్ ను కూడా సోమవారం ప్రారంభించారు. 13.50 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన ల్యాబ్ ను, సమ్మర్ క్యాంపును ఆయన లాంచానంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అంధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనా దృక్పథం పెంపొందుతుందని అన్నారు. అదేవిధంగా సమ్మర్ క్యాంపులు సహితం విద్యార్థులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే అవకాశం లభిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కూడా మాట్లాడారు. వారి విద్యాభ్యాసం, సౌకర్యాలు పై కూడా ఆరాదీశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తులు జాప్యం లేకుండా పరిష్కరించండి

**అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి ఫైజాన్ అహ్మద్ ల ఆదేశం**



**మేడ్చల్ కలెక్టరేట్, మే11 (నినాదం):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్క రించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు జిల్లా కలెక్టర్లు డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (134) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తా మనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరి గా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తు లపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించండి

**కలెక్టరేట్లో వినతి పత్రం సమర్పించిన సిపిఐ పార్టీ నాయకులు**



**జవహర్ నగర్, మే 11 (నినాదం):** జవహర్ నగర్ లో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్లో సిపిఐ పార్టీ నాయకులు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్ నేతృత్వంలో సిపిఐ నాయకులు కలెక్టర్ ను కలిసి తమ విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం వేలాది మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారని అయితే వారికి ఇల్లు కేటాయించకుండా కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల నెరవేరలేదని ఆయన దుయ్యబట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అవస్థలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జిల్లా సమైక్య ప్రధాన కార్యదర్శి స్వరూప నాయక్, ఏఐటీయూ మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, బి. నాని తదితరులు పాల్గొన్నారు.

# శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్

**బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**





**కుత్బుల్లాపూర్, మే 11 (నినాదం) :** 125 - గాజుల రామారం డివిజన్ మహాదేవ పురం శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన పంచముఖ హనుమాన్, నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై పంచముఖ హనుమాన్ ప్రతిష్టాపన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్ అని, పంచ ముఖి హనుమాన్ స్వామి వారి ఆశీస్సులు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్యాల సాయి ప్రసాద్, రవీందర్ రెడ్డి, సింహాచలం, ప్రభాకర్ రెడ్డి, నవీన్, రంగారావు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇమ్రాన్ బేగ్, ముసా ఖాన్, బోయిని మహేష్, చిన్నా చౌదరి, సాయిబాబా, రాములు గౌడ్, నవీన్, మహేష్, శ్రావణ్, ప్రసాద్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి కళ్యాణమహోత్సవ వేడుకల్లో కందికంటి శ్రీధర్ గౌడ్



**ఎల్ బినగర్, నినాదం :** తెలంగాణ సంస్కృతికి బీరప్ప ఉత్సవాలు ప్రతీకలని తరతరాల సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఖిల్లా మైసమ్మ దేవాలయం మాజీ చైర్మన్ కందికంటి శ్రీధర్ గౌడ్ తెలిపారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకం లక్ష్మి అంజయ్య ఆహ్వానం మేరకు తొర్రూర్ లో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కళ్యాణం కనులారా వీక్షించి, స్వామివారి ఆశీస్సులు తీసుకుని , మొక్కులు సమర్పించారు. బీరప్ప స్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నారు.


## రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ అభివృద్ధి

**ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం**

**ఒకే రోజు 19 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ప్రజాఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు, మే 11(నినాదం) :** రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీ నగర్, ఐడిఎ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీ రామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో 19 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను సైతం పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, సిఐ రవీందర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థ సిటీ కళాశాల

**విద్యా వారోత్సవ ప్రారంభసభలో చార్మినార్ ఎం.ఎల్.ఏ జుల్ఫీకర్ అలీ..**



**హైదరాబాద్ ప్రతినిధి, మే11 (నినాదం) :** సిటీ కళాశాల దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ అని చార్మినార్ శాసనసభ్యులు జుల్ఫీకర్ అలీ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మార్చి నెలలో ప్రారంభించిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' లో భాగంగా నిర్వహించ తలపెట్టిన విద్యావారోత్స వాల ప్రారంభసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తాను జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగటానికి సిటీ కళా శాల పునాదిగా నిలిచిందని అన్నారు. తన తండ్రి సూచనతో తాను సిటీ కళాశాలలో ప్రవేశం తీసుకున్నానని అన్నారు. కళాశాలతో తనకు మధు రమైన జ్ఞాపకాలున్నాయని తన సహచరి కూడా సిటీ కళాశాలం విద్యార్థి అని చెప్పారు. సిటీ కళాశాల ప్రగతికి తనవంతు సహకారం అందిసా ్తనని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక లక్ష్యాలతో విద్యావారోత్సవాలు నిర్వహిం చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రచురించిన విద్యా వారోత్సవాల బ్రోచర్ ను ఆయన ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ ప్రసాద్ మాట్లా డుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్ని బలోపేతం చేయాలని సంకల్పంతో ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నదన్నారు. వచ్చే విద్యాసంవ త్సరం నుండి ఎంబిఎ లాంటి ఉపాధి కేంద్ర పిజి కోర్సును సిటీ కళాశాలలో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్.సి.విద్యాధర భట్ మాట్లాడు తూ.. విద్యా వారోత్సవాలు విజయవంతం చేయడంలో పూర్వ విద్యారు ్థలు ఇతోధికంగా సహకరించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్ అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి పి.అనంత మోహ న్, వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ పి.శాంతి, డాక్టర్. రాజేంద్ర కుమార్, కళాశాల ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ నీరజ జవ్వాజి, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ మాధవి, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో ఘనంగా విద్యా వారోత్సవాల ప్రారంభం



**దుబ్బాక, మే11 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో విద్యా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్ర మానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాం సుందర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుబ్బాక పురపాలిక అధ్యక్షురాలు శ్రీరాం సంగీత రవీందర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా వారోత్సవాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్య కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా సమాజంలో చైతన్యం, బాధ్యత, సేవాభావం పెంపొందించే శక్తిగా నిలవాలని పేర్కొన్నారు. యువతను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. పురపాలిక ఉపాధ్యక్షురాలు ఆస సులోచన స్వామి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సామాజిక విలువలను కూడా అలవరచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సేవాభావం, సమాజ పట్ల బాధ్యతతో ముందుకు సాగితేనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. కౌన్సిలర్లు తునికి సురేష్, ఎం.డి. చాంద్ మియా మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల దుబ్బాక పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూ విశిష్ట సేవలు అందిస్తోందని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని మాట్లాడుతూ, విద్యా వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక చైతన్యం, సృజనాత్మకత పెంపొందించడమేనని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా పలు విద్యా, సాంస్కృతిక, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాం సుందర్ మాట్లాడుతూ, విద్యార్థులు అకాడమిక్ ప్రతిభతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి సారించాలని సూచించారు. కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి. నాగేశ్వరరావు, ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్. రఘునందన్ రెడ్డి, ఎం. వెంకటరెడ్డి, ఎన్. ఆంజనేయులు, డాక్టర్ వి. వెంకటేష్, ఏ. రాజశేఖర్, బి. చందన, ఎస్. ఎల్లయ్య తదితరులు, అధ్యాపకేతర సిబ్బంది సాయి కృష్ణ, రాజు, ఇమ్రాన్ మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**గౌతమ్ నగర్ డివిజన్ గోపాల్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం..పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి**



**మల్కాజిగిరి, మే11 (నినాదం) :** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్ కమిటీ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం లోని అన్ని డివిజన్ లలో బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటులకు కృషి చేస్తున్నామని, గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు కమిటీ ఏర్పాట్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నంది కంటి శ్రీధర్, గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్, సీనియర్ నాయకులు మేకల శ్రీ రాము యాదవ్, నియోజకవర్గ కమిటీ ప్రతినిధులు జేపీసీ వెంకన్న, మహమ్మద్ ఖలీల్, రావుల అంజయ్య, పరశురాంరెడ్డి, వీరేశం యాదవ్, బైరు అనిల్, కృష్ణ గౌడ్, సిద్ధిరాములు, రామచర్ల నర్సింగ్, మర్రి శీను, హబీబ్, సిహెచ్ వెంకట్, భరత్, సిద్ధులు, సుధామ తదితరులు పాల్గొన్నారు.

## అనాధికారిక విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**రవి రాజ్ రాథోడ్**



**కీసర, మే 10, (నినాదం) :** కీసర, విద్య సంస్థల పై కఠిన చర్యలు తీసుకోవాలని రవి రాజ్ రాథోడ్ తెలిపారు. దీనిలో భాగంగా అనుమతులు, గుర్తింపు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ బీ ఎం ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో విద్యను వ్యాపారంగా మార్చి కొంతమంది నిర్వాహకులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేకుండా, నకిలీ బోర్డులు, తప్పుడు ప్రచారాలతో అనేక విద్యాసంస్థల వలన అమాయక తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. అధిక ఫీజులు, సరైన మౌలిక వసతుల లేమి, అర్హత కలిగిన ఉపాధ్యాయుల కొరత, భద్రతా ప్రమాణాల పాటించకపోవడం వంటి అంశాలు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. విద్యా హక్కు ప్రతి విద్యార్థికి సమానంగా అందాల్సిన సమయంలో, కొంతమంది నిర్వాహకులు దానిని డబ్బు సంపాదించే సాధనంగా ఉపయోగించడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి, అనధికారికంగా నడుస్తున్న పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే మూసివేయడంతో పాటు, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్న నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి పాఠశాల తమ అనుమతులు, గుర్తింపు పత్రాలు మరియు ఫీజు వివరాలను ప్రజలకు స్పష్టంగా ప్రదర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, తల్లిదండ్రుల విశ్వాసాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్య అనేది సేవగా ఉండాలి గానీ వ్యాపారంగా మారకూడదు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి" అని రవి రాజ్ రాథోడ్ స్పష్టం చేశారు.

## కార్మికుల హక్కుల సాధనకు కార్మికులకు అండగా ఉంటా

**సెంట్రింగ్ పని బంద్ గోడపత్రికను ఆవిష్కరించిన కేఎం ప్రతాప్**



**కుత్బుల్లాపూర్, మే 11 (నినాదం) :** గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారు మే 16వ తేదీ నుండి సమస్యల సాధన కోసం నిర్వహించబోయే సెంట్రింగ్ పని బంద్ గోడ పత్రికను రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సిపిఆర్ కాలనీలో గల తన నివాసంలో ఆవిష్కరించారు.ధరల పెంపు కోసం శాంతియుతంగా బంద్ పాటించే సమ యాల్లో మాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు సహకారాన్ని అందించాలని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కేఎం ప్రతాప్ ను కోరారు.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతాన న్నారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, సెంట్రింగ్ కార్మికులు తమ సమస్యల సాధన కొరకు చేపడుతున్న సెంట్రింగ్ పని బంద్ కార్యక్రమానికి తన పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్టు తెలియజేశారు.మన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల, సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నానన్నారు. కార్మికులకు తగిన న్యాయం చేసి, కార్మిక సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో, జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి. శ్రీనివాస్,ఎన్ అశోక్, సలహాదారులు బి.వెంకటేశ్వరరావు,వి. ఇంద్రసేనారెడ్డి, పి.నరసింహ రెడ్డి,టి.నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ కుంట వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ సి హెచ్. సత్తిబాబు,జనరల్ సెక్రెటరీ జీ.ప్రవీణ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ వి.రాకేష్, కోశాధికారి టి. శివశంకర్ పి. శ్రీనివాస్,ఆర్గనైజర్లు ఈశ్వర్, కృష్ణ, మహంకాళిరావు, సత్యనారాయణ, ముని, సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగివచ్చావని తల్లి మందలింపు

**మనస్థాపంతో తనయుడి అదృశ్యం**



**జవహర్ నగర్, మే 11(నినాదం):** తాగి ఇంటికి వచ్చాడని తల్లి మందలించడంతో మనస్థాపం చెందిన ఓ తనయుడు ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకా రం... జవహర్ నగర్లోని నందమూరినగర్ లో నిషా నలు గురు కుమారులతో కలిసి జీవనం సాగిస్తుంది. చిన్న కుమా రుడైన రబ్బానీ అన్సారీ(26)కు వివాహం కాలేదు. అంబేద్క రనగర్లో పంచర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8న మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి నిషా కుమా రుడిని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన కుమా రుడు రబ్బానీ అన్సారీ ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. అతని అచూకి కోసం చుట్టుప్రక్కల, బంధు వుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇదేనా భేటీ బచావో..?

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

**జగిత్యాల ప్రతినిధి మే 11 నినాదం :** మోడీ బే టి బచావో అని నినాదం చేస్తు ఆడబిడ్డకు అన్యాయం చేసిన బండి సంజయ్ ను పక్కన కూర్చోపెట్టుని మాట్లాడటం ఆశ్చర్యకరమని బి ఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ జనరల్ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను బీజేపీ క్రమశిక్షణ గల కార్యకర్త అని బండి సంజయ్ చెపుతుంటారు అసలు క్రమశిక్షణ లేదని ప్రజలకు అర్థమైపోయింది అన్నారు.సాధారణ నేరానికి అదనంగా పోక్స్ కేసు వర్తిస్తదని నేరానికి అనుగుణంగా చట్టాన్ని వినియోగిస్తారా లేదా అని ప్రశ్నించారు.బండి భగీరథ చేసిన నేరానికి 20 ఏళ్ల శిక్ష పడుతుందని అన్నారు.మైనర్ బాలిక సంఘటన పై కనీసం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ మంత్రిగా కూడ పర్యవేక్షించడం లేదన్నారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి రాష్ట్రాల్లో శాంతి భద్రతలను పర్య వేక్షించే బండి సంజయ్ కుటుంబ సభ్యుడే నేరం చేశారన్నారునేరాన్ని కప్పిపుచే ప్రయత్నం చేసిన బండి సంజయ్ శిక్షార్హులు.అన్నారు.బండి సంజయ్ బాధ్యత రాహిత్యం నైతికంగా కొనసాగే హక్కు లేదన్నారు. క్రమశిక్షణ గల కార్యకర్త గా ఎదిగిన నాయకుడిగా.. నీ కుటుంబాన్ని క్రమశిక్షణ నేర్పించలేనప్పుడు దేశానికి ఏం క్రమశిక్ష నేర్పిస్తావు అని నిలదీశారు.ఏ మాత్రం నైతిక విలువలు ఉన్న మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.వాస్తవాలు మాట్లాడితే కరీంనగర్ లో ఎమ్మెల్యే నివాసం పై దాడి చేయిస్తా వు ఇదేనా నీ క్రమశిక్షణ..అని బండి సంజయ్ ను నిలదీశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి..బండి సంజయ్ బంధం ఫెవికల్ బంధం..అన్నారు.మైనర్ బాలిక పై హానీ ట్రాప్ నేరం ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు.



### మోడీ ఇంటెలిజెన్స్ ఏం చేస్తుంది.?

సంఘటన వివరాలు వెలికి తీయాల్సిన బాధ్యత ప్రధాని నరేంద్ర మోడీ ఇంటలిజెన్స్ లేదా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో ఏ ఆడబిడ్డకు అన్యాయం జరిగిన న్యాయం జరిగే వరకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు.ప్రజా జీవితంలో ఉండే నాయకుల జీవితాలు ఆదర్శంగా, పారదర్శకంగా ఉండాలన్నారు.మోడీ అండ ఉందని. రేవంత్ రెడ్డి కళ్ళకు గంతలు కట్టుకున్నాడని అన్నారు ఉద్యమాలకు పేరుబడిన కరీంనగర్ నేరాలకు ప్రతీకగా చర్చకు రావడం దురదృష్టకరమన్నారు. సంజయ్ కు నైతిక విలువలు ఉంటే తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. భగీరథ్ పై ఉద్దేశ పూర్వకముగా నేరానికి అనుగుణమైన సెక్షన్లు పెట్టకుండా తప్పించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ను సస్పెండ్ చేయాలన్నారు. ఆడబిడ్డ పై అఘాయిత్యం జరిగితే పీ సి సి కనీసం ఖండించలేదన్నారు.రేవంత్ రెడ్డి లాలూచీ పడకపోతే తన వ్యవహారం తెర పైకి వస్తె నౌకరీ పోతది అని లాలూచిపడుతాడు.. పీ సీ సీ ఏం చేస్తుంది..ఏఐసిసి దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కొమురవెల్లి గ్రామపంచాయతీకార్యదర్శి








**కొమురవెల్లి, ఏప్రిల్ 11 (నినాదం):** సిద్దిపేట జిల్లా కోమురవెల్లి మండల కేంద్రంలో ఏసిబి ఎ రైట్స్ కలకలం రేపాయి ఏసీబీ డిఎస్పి సుదర్శన్ మెదక్ రేంజ్ తెలిపిన వివరాల ప్రకారం ఏసీబీ వలకి చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి రూ. 10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కారదర్శి తో పాటు కొమురవెల్లి సర్పంచ్ భర్త కూడా అరెస్టుసిద్దిపేట జిల్లాలో కలకలం కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్త ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.డ్రైనేజీ పైప్‌లైన్ తొలగింపు కోసం డిమాండ్ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికిచెందినఫిర్యాదుదారుడి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను అక్కడ నుంచి తొలగించాలనే అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ (ఏూ-1) పది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సోమవారం పక్కా ప్రణాళికతో అధికారులు నిఘా పెట్టారు. సర్పంచ్ భర్త ద్వారా నగదు స్వీకరణ చేశారు అని తెలిపారు సోమవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే లంచం డబ్బులు తీసుకుంటుండగా అధికారులు దాడి చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి అంజనేయులు (ఏూ-2) ఆ పది వేల రూపాయలను స్వీకరించారు. ఏసీబీ అధికారులు వారిద్దరినీ పట్టుకుని, వారి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

**కోర్టులో హాజరు పరచనున్న అధికారులు**

విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి, అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించినందుకు గాను పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, సర్పంచ్ భర్త అంజనేయులును అధికారులు అరెస్టు చేశారు. వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుపై ప్రస్తుతం తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

**అవినీతిపై ఫిర్యాదు చేయండి**

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ దాడిలో ఏసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



## కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి మే11 (నినాదం):** నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. "జల్ సంచ య్ జన బాగిదారి" కార్యక్రమంలో భాగంగా నీటి సంర క్షణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని సోమవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రజలలో ఈ విషయమై అవగాహన కల్పించేందుకు గాను ఏర్పాటు చేసిన ప్రచార వాహనం జిల్లాలోని అన్ని గ్రామాలను సందర్శిస్తుందని, తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, నీటి పొదుపు ,ఉన్న నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలో వాటికి సంబంధించిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు,నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, నీటిని వృద్ధిపరిచేందుకు తోడ్పడే ఫామ్ పాండ్స్ ,నీటి సంరక్షణ కట్టడాలపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు,స్థానిక కార్పొరేటర్ వున్న జ్ఞానేశ్వరి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, డిఆర్డిఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం, తదితరులు పాల్గొన్నారు .

# నీటి సమస్య పరిష్కారం

## నినాదం కథనానికి స్పందన..



**మంచిర్యాల, మే 11(నినాదం):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ లో నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం నినాదం పత్రికలో దాహం కేకలు.. పట్టించుకోని సింగరేణి అధికారులు ప్రచురితమైన కథనానికి సింగరేణి అధికారులు స్పందించారు. వెంటనే 6 వ డివిజన్ లో సింగరేణి అధికారులు నీటిని సరఫరా చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నీటి సమస్యను కథనం ద్వారా ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నినాదం పత్రిక కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల సమస్యలను సత్వర పరిష్కారం కోసం ప్రజవాణి

## ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్




**వికారాబాద్, మే 11(నినాదం):** బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించబడిందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. స్వయంగా ఆమె ఫిర్యాదుదారులను కలిసి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ ఫిర్యాదుల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి పలు ఫిర్యాదులు అందాయి వాటిపై తక్షణమే స్పందించిన ఎస్పీ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి, ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు బలహీన వర్గాల ఫిర్యాదుల పట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేస్తున్నామని, తద్వారా ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు అవసరం అనుకుంటే నేరుగా కార్యాలయంలో తనను కలవవచ్చని తెలిపారు.

N NADAM CINEMA

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్




ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాప్షన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

# వారణాసికి బయలుదేరుదాం

## హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్



ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# విజయ్‌పై ప్రియాంక వ్యాఖ్యలు వైరల్



గ్లోబల్ స్టార్‌గా ఓ వెలుగు వెలుగుతున్న ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం ప్రస్తుత తమల సిఎం, హీరో విజయ్‌తో మొదలైంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఆయన గురించి గతంలో ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. 2002లో విడుదలైన తమిజన్ సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో విజయ్ హీరోగా నటించగా, ప్రియాంక హీరోయిన్‌గా కనిపించారు. అప్పట్లో కొత్తగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియాంకకు తమిళ భాష కూడా తెలియదట. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నాకు అప్పట్లో తమిళం అస్సలు రాదు. డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టి చెప్పేదాన్ని. సినిమాల షూటింగ్ ఎలా జరుగుతుంది? సెట్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై కూడా పెద్దగా అవగాహన లేదు. థియేటర్‌లో సినిమాలు చూడడమే నాకు తెలిసిన అనుభవం అంటూ గుర్తుచేసుకున్నారు. అయితే 'తమిళన్' షూటింగ్ సమయంలో విజయ్‌కు ఉన్న అభిమాన గణాన్ని చూసి తాను పూర్తిగా ఆశ్చర్యపోయానని ప్రియాంక తెలిపారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వందలాది అభిమానులు వచ్చేవారని, సెట్స్‌లోకి రావడానికి కూడా పోటీ పడేవారని చెప్పారు. విజయ్ డ్యాన్స్ చేస్తున్నా, డైలాగులు చెబుతున్నా అభిమానులు ఆయననే చూస్తూ ఉండేవారు. ఆ క్రేజ్ చూసి నేను షాక్ అయ్యాను. ప్రజలు విజయ్‌ను దేవుడిలా ఆరాధిస్తున్నారనే భావన నాకు కలిగింది అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.


# విశ్వంభర మూవీపై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు




మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందు తున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక్ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు ప్లాన్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబం ధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787